క్లుప్తంగా

వితరణ



పేద మహిళకు టీవీ అందజేస్తున్న 'దయగల గోడ' నిర్వాహక సభ్యులు

బొబ్బిలి: పట్టణంలోని దయగల గోడ వద్ద ఆదివారం 'దయగల గోడ' వ్యవస్థాపకుడు మింది విజయమోహన్ తన ఇంట్లోని పాత టీవీని విడిచిపెట్టారు. దీనిని ప్రసాద్‌నగర్ కాలనీకి చెందిన ఓ పేద మహిళ తీసుకున్నారు. ప్రజలు తమ వద్ద ఉన్న అదనపు వస్తువులను ఇక్కడ విడిచిపెడితే.. అవసరమున్న వారు వాటిని తీసుకుని వినియోగించుకుంటున్నారు. దీంతో నిత్యం ఇక్కడ చాలా మంది పాత దుస్తులు, ఇంటి సామగ్రిని విడిచి పెడుతున్నారు. సభ్యులు మింది రామకృష్ణ, గ్రీన్‌బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి, కె. కృష్ణదాసు మాస్టారు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి



సమావేశంలో పాల్గొన్న మాజీ సైనికులు

బొబ్బిలి: మాజీ సైనికుల సంక్షేమానికి ప్రతి సభ్యుడూ కట్టుబడి ఉండాలని, సంఘ నియమ నిబంధనలను పాటించాలని గౌరవాధ్యక్షుడు మరడ రామినాయుడు, అధ్యక్షుడు రేవళ్ల కిరణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ కార్యకలాపాలు, సభ్యుల సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కార్యదర్శి గోవింద నాయుడు, సంయుక్త కార్యదర్శి రవీంద్రమోహన్, కోశాధికారి వీఎన్ శర్మ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో శానిటేషన్ తప్పనిసరి



పాతబస్టాండ్ సమీపంలో శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్

రాజాం: పట్టణంలోని అన్ని వార్డుల్లో శానిటేషన్ కార్యక్రమాలు తప్పనిసరిగా చేపట్టాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ పారిశుధ్య కార్మికులకు సూచించారు. ఈ మేరకు పట్టణంలోని సారధి రోడ్డు, ఠాణా వీధి, బొబ్బిలి రోడ్డు, అమ్మవారి కాలనీ, కొండంపేట, పాతబస్టాండ్, తదితర ప్రాంతాల్లో చేపడుతున్న శానిటేషన్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. రాజాంలో పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతర ముగిసేవరకూ స్పెషల్ డ్రైవ్ శానిటేషన్ కార్యక్రమాలు చేపడతామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బడ్జెట్‌లో వేతనజీవులకు మొండిచేయి



మహిళా కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: రాష్ట్ర బడ్జెట్‌లో వేతనదారులకు మొండిచేయి చూపారని.. దీంతో వారి ఆశలు అడియాశలయ్యాయని కార్మిక నేత సీహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. మండల కేంద్రంలో మహిళా కార్మికులతో ఆదివారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రసంగంలో కొన్ని పథకాల అమలు కోసం కేటాయింపులు చేస్తామన్నారే తప్ప జీతాల కోసం పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి న్యాయం చేయలేదని ఆరోపించారు. ఆప్కాస్ రద్దు చేయడం వల్ల కార్మికుల ఉద్యోగ భద్రత ఉండదన్నారు. కార్యక్రమంలో సుజాత, రామలక్ష్మి, రవణమ్మ, చిన్నమ్మడు, అప్పలనరసమ్మ, పార్వతి పాల్గొన్నారు.

చురుగ్గా అప్పలంపేట - వంతరాం బీటీ రోడ్డు పనులు



అప్పలంపేట - వంతరాం గ్రామాల మధ్య నిర్మిస్తున్న బీటీ రోడ్డు

తెర్లాం: మండలంలోని అప్పలంపేట - వంతరాం బీటీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ రోడ్డు పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోటి రూపాయల నిధులు మంజూరయ్యాయి. రోడ్డు పనులకు సంబంధించి అప్పటి బొబ్బిలి ఎమ్మెల్యే, ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు భూమిపూజ చేశారు. ప్రస్తుతం రోడ్డు పనులు శరవేగంగా జరుగుతుండడంపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● సౌకర్యాలు అంతంతమాత్రమే..



బెంచీలు లేక నేలపై కూర్చున్న పదో తరగతి విద్యార్థులు



మినరల్ వాటర్ లేకపోవడంతో ట్యాంక్ నీరు తాగుతున్న విద్యార్థులు

రామభద్రపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 770 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి 35 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధిస్తున్నారు. అయితే ఇటువంటి పాఠశాలలో కనీస వసతులు కల్పించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్యార్థులు కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేయకపోవడంతో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు నేలపైనే కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల కొద్దీ కింద కూర్చోవడానికి చాలా ఇబ్బందిగా ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పాఠశాలలో గతంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్ మూలకు చేరడంతో విద్యార్థులు తాగునీటికి నానా ఇబ్బంది పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో పాఠశాలలో ఏర్పాటు చేసిన ట్యాంక్ నుంచి ట్యాప్‌ల ద్వారా వస్తున్న నీరు తాగుతున్నారు. కొంతమంది విద్యార్థులు ఇంటి వద్ద నుంచి బాటిల్స్‌తో తాగునీరు తెచ్చుకుంటున్నారు. మినరల్ వాటర్ మాట పక్కనపెడితే శుభ్రమైన జనరల్ వాటర్ కూడా అందుబాటులో లేదని వాపోతున్నారు. ఇదిలా ఉంటే బాలికలకు టాయిలెట్స్ ఉన్నప్పటికీ, బాలురకు లేకపోవడంతో అత్యవసర సమయంలో ఆరుబయటకు పరుగులు తీయాల్సిన పరిస్థితి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. – రామభద్రపురం

బంగారు ఆభరణం అపహరణ



గౌరమ్మను విచారణ చేస్తున్న పోలీసులు

బొబ్బిలి రూరల్: మండలంలోని కారాడ గ్రామానికి చెందిన బి.గౌరమ్మ (60) మెడలోని బంగారు తాడును ఓ మహిళ అపహరించింది. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి.. గౌరమ్మ పొలం నుంచి ఇంటికి వస్తుండగా... ఓ ఆటోలో వస్తున్న గుర్తు తెలియని మహిళ ఇంటి వద్ద దింపుతామని చెప్పి ఆటో ఎక్కించుకుంది. అప్పటికే ఆ ఆటోలో ఇద్దరు వ్యక్తులున్నారు. సరిగ్గా గ్రామ సమీపంలోకి వచ్చేసరికి మెడలో ఉన్న రెండు తులాల బంగారు తాడును తెంచుకుని, ఆమెను కిందకు దింపేశారు. దీంతో బాధితురాలు లబోదిబోమంటూ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా... సీఐ సతీష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన..

● ఎమ్మెల్సీ విక్రాంత్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్, డాక్టర్ తలే రాజేష్, తదితరులు

రేగిడి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలనకు శ్రీకారం చుట్టిందని.. సీఎం చంద్రబాబునాయుడే స్వయానా తమ పార్టీ కార్యకర్తల సమావేశంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులకు ఎటువంటి పనులు కానివ్వమని అనడం ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమం అటకెక్కిందని, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను అరెస్టులు చేయడం, అన్యాయంగా ఇబ్బందులు పెట్టడం పనిగా పెట్టుకుందని ఆరోపించారు. అధికారం చేపట్టి పది నెలలు కావస్తున్నా పదిమంది పేదవారికి కూడా సంక్షేమం అందని పరిస్థితి నెలకొందని ఎద్దేవా చేశారు. ఎంత సేపూ తమ కార్యకర్తల జేబులు నిప్పడం, అడ్డంగా ప్రజాధనాన్ని లూటీ చేయడం, ప్రశ్నించేవారిపై కేసులు నమోదు చేయడం తప్ప ఏం పాలన సాగించారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వానికి త్వరలోనే ప్రజలు బుద్ధి చెప్పే రోజు వస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, రేగిడి మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ..



రేగిడి మండలం చిన్నశిర్లాం గ్రామంలో రామమందిరం నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. గ్రామంలో ఉండే రామమందిరం జీర్ణావస్థకు చేరుకోవడంతో గ్రామస్తులందరూ కొత్త ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రూ. 50 లక్షలతో ఆలయాన్ని నిర్మించనున్నట్టు వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పురోహితుడు భాస్కరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు. – రేగిడి

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయరూ..



నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే పణుకువలస – వంతరాం రోడ్డులో పలుచోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. ఆ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు గాని స్పీడ్ బ్రేకర్లు గాని ఏర్పాటు చేయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా కొరటాం వద్ద ఉన్న మలుపు ప్రమాదకరంగా మారింది. – తెర్లాం

ప్రాణకోటి పట్ల దయతో మెలగాలి

● త్రిదండి చినజీయర్ స్వామి



అనుగ్రహ భాషణం చేస్తున్న చినజీయర్ స్వామి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ సర్వ ప్రాణికోటి పట్ల దయతో మెలగాలని త్రిదండి చిన శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ఆదివారం స్థానిక వికాస తరంగిణి కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అనుగ్రహభాషణం చేస్తూ.. మానవ సేవే మాధవ సేవగా, స్వీయ ఆరాధన – సర్వ ఆరాధన అనే లక్ష్యాలతో వికాస తరంగిణి సేవలందిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రాణికోటి పట్ల దయతో మెలగడం ద్వారా పర్యావరణ సమతుల్యత సాధించవచ్చన్నారు. దేశవాళీ గోవులను సంరక్షించడం ద్వారా భూసారాన్ని పెంచడంతో పాటు రేడియేషన్ తగ్గించుకోవచ్చునని చెప్పారు. మహిళల్లో వచ్చే సర్వైకల్, రొమ్ము క్యాన్సర్లను ప్రారంభ దశలో గుర్తించేందుకు వీలుగా మహిళా ఆరోగ్య వికాస్ కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి టీటీవీ రమణమూర్తి, వైష్ణవాచార్య పీఠాధిపతి తిరుమల రంగనాథం, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణం



కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డు

రాజాం: నగరంలోని మారుతీనగర్‌లో 15వ ఆర్థిక సంఘ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. రూ.1.50 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపట్టామని మున్సిపల్ ఏఈ వెంకట్ తెలిపారు. రోడ్డు పనులు పూర్తి కావడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సంగాంలో ప్రత్యేక పూజలు..



వంగర మండల పరిధి సంగాంలో వెలిసిన పవిత్ర సంగమేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని వేగావతి, నాగావళి, సువర్ణముఖి నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఎంపీపీ ఉత్తారావెల్లి సురేష్‌ముఖర్జీ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. – వంగర

కిమిడి కుటుంబానికి పరామర్శ



కిమిడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తలే రాజేష్, పార్టీ నాయకులు

వంగర: మండల పరిధి తలగాం గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు తల్లి కిమిడి అమ్మడమ్మ(85) ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాజాం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలే రాజేష్ గ్రామానికి వెళ్లి కిమిడి ఉమామహేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం నిర్వహించిన అంత్యక్రియల్లో కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంపీటీసీ సభ్యుడు కిమిడి సన్యాసినాయుడు, పార్టీ నాయకులు కనగల పారినాయుడు, బొత్స ప్రవీణ్, బొక్కెల వెంకట అప్పలనాయుడు, బూరాడ వెంకటరావు, కాబోతుల శ్రీనివాసనాయుడు, యలకల వాసునాయుడుతో పాటు పలు పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీత మోక్ష ప్రదాయిని..



మాట్లాడుతున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధి ఎన్‌వీ రమణ

రేగిడి: భగవద్గీత మోక్ష ప్రదాయిని అని పాలకొండకు చెందిన సత్యసాయి సేవా సమితి ప్రతినిధి ఎన్‌వీ రమణ భక్తులకు సూచించారు. మండలంలోని దేవుదళ గీతాశ్రమంలో ఆధ్యాత్మిక గురువు గొర్లె దామోదరరావు ఆధ్వర్యంలో దివ్యజీవన సత్సంగం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత మానవుడ్ని సాధారణ స్థితి నుంచి అసాధారణ స్థితికి తీసుకెళ్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ భగవద్గీత పఠనం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి బోర్లకు మరమ్మతులు..



రాజాం మండల పరిధిలోని బొద్దాం, అమరాం గ్రామాల్లో తాగునీటి బోర్లకు ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఆదివారం మరమ్మతులు చేపట్టారు. వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, ఈ క్రమంలో పాడైన బోరుబావులకు మరమ్మతులు చేపడుతున్నామని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు తెలిపారు. గ్రామాల్లో పాడైన బోరుబావుల వివరాలు తమకు తెలియజేయాలని కోరారు. – రాజాం

కష్టపడిన వారికి గుర్తింపు

● వైఎస్సార్‌సీపీ నాయకులు పాలవలస విక్రాంత్, తలే రాజేష్



అచ్చెన్నాయుడుని అభినందిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రేగిడి: వైఎస్సార్‌సీపీ అభివృద్ధి కోసం కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. చిన్నశిర్లాం గ్రామానికి చెందిన టంకాల అచ్చెన్నాయుడుకు వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్ష పదవి రావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం గ్రామానికి వచ్చి అచ్చెన్నాయుడును అభినందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వావిలపల్లి జగన్మోహనరావు, సర్పంచ్ టంకాల ఉమాపాపినాయుడు, ఖండ్యాం ఎంపీటీసీ సభ్యుడు కింజరాపు సురేష్, మధుసూదనరావు, డాక్టర్ నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విద్యార్థులకు మేలు

తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్. కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మా కిష్టం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానం కలుగుతుందని చెప్పారు. పాఠ్య పుస్తకాలతో పాటు నీతి కథలు, దేశ నాయకుల జీవిత చరిత్రలు, ఇతిహాసాలు, కాంపిటేటివ్ పరీక్షల పుస్తకాలు చదవాలని సూచించారు.

చిన్నారులకు ఆహారం, దుస్తులు అందజేత



బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్న నక్కల కుటుంబాలకు చెందిన చిన్నారులకు పట్టణానికి చెందిన వనమిత్ర అధ్యక్షుడు కె. కృష్ణదాసు మాస్టారు ఆదివారం పౌష్టికాహారం, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. సుమారు 25 మంది చిన్నారులకు అందజేసినట్లు మాస్టారు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. – బొబ్బిలి

ప్రశాంతంగా ఎన్‌సీసీ 'ఎ' సర్టిఫికెట్ పరీక్ష



ఎన్‌సీసీ ఏ సర్టిఫికెట్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సీసీ 'ఎ' సర్టిఫికెట్ పరీక్షకు 253 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎన్ సీ సీ ఆఫీసర్ బీవీ అచ్యుత్‌కుమార్ తెలిపారు. రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సన్ స్కూల్, డీఏ వీ పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలికలు), శ్రీకాకుళం జిల్లా పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల (బాలురు), కొల్లివలసలోని ఏపీఎస్‌డబ్ల్యూ పాఠశాల, గోదావరి సరీఫ్, గరివిడి పాఠశాలల నుంచి ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారన్నారు. వీరికి రాతపరీక్షతో పాటు డ్రిల్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు చీఫ్ ఎగ్జామినర్లుగా సురేష్ కుమార్, 14వ ఆంధ్రా బెటాలియన్ నుంచి సుబేదార్ జితేంద్ర వ్యవహరించారు. మల్లి, శ్రీనులతో పాటు ఏఎన్‌ఓలు హరికృష్ణ, పుష్పలత, ఉదయ్‌కుమార్, సంతోషి, విష్ణు సమక్షంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

రామభద్రపురం: దుకాణాలు, కల్యాణ మండపాలు, ఆలయాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై వి. ప్రసాదరావు సూచించారు. మండలంలోని ఆరికతోటలో ఆదివారం పర్యటించి దుకాణదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేరాలు పెరుగుతున్న తరుణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిదన్నారు. కేసుల ఛేదనలో కీలకమైన ఆధారాలు లభ్యమవుతాయని చెప్పారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మండలంలోని పలు ప్రధాన కూడళ్లతో పాటు సమస్యాత్మక ప్రాంతాలలో నిఘా నేత్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని దుకాణాదారులకు సూచిస్తున్న ఎస్సై ప్రసాదరావు